
గంగాధర
చదువరాని సీత

ముహూర్తం కూడా నిశ్చయం చేశారు. ఇందులో సీత ఇష్టాయిష్టాలతో ఎవరికీ అవసరం లేకపోయింది.

పెళ్ళికి నరసింహం మాస్టార్ గారి ఇంటికి వచ్చే భాసి పేరులంతా పాయం ప త్తిరు! అందులో గోపి కూడా ఒకడు! సీత ముందు ఎప్పుడూ కనిపించాడు పెళ్ళి కుమారుడు. "ఆస్తి ఉందిగా ... సీత సుఖపడిపోతుంది ..." అని తనను తాను సమాధాన పరుచుకున్నాడు గోపి. కానీ, ఏమి లాభం? పెళ్ళికొడుకు సీత మెడలో మూడు ముళ్ళు వేస్తుంటే—"ఇది అన్యాయం! అక్రమం!" అంటూ ఎవరో గుండెల్లో దూరి అరిచినట్టు అనిపించింది గోపికి. అతని కళ్ళలోంచి కన్నీరు గిరగిరా తిరిగింది. పెళ్ళి భోజనం కూడా ముట్టు కోకుండా బరువుగా అక్కడి నుండి తప్పుకున్నాడు.


ఇరుగు పొరుగు ముత్తయిదువులంతా ముసిముసి నవ్వులు నవ్వుతుంటే బిత్తర పోతూ నడక గదిలోకి అడుగు పెట్టింది సీత. వెళ్ళిన ఐదు నిమిషాలకే గదిలోంచి గావు కేకలు వినిపించినాయి.

"అక్కయ్య అరుస్తున్నదే ..." అంటూ వచ్చి చెప్పిన సుమతిని బయటకు నెట్టి పెద్దలంతా విరగబడి నవ్వుకున్నారు.

"వదినా! గుర్తుందా? ..." అంటూ గడిచిన మొదటి రాత్రుళ్ళు నెమరువేసుకున్నారు కొందరు.

కిరాతకుడి చేతిలో చిక్కుకున్న జవ్వని పిలుపులా ఉంది సీత ఆర్తనాదం. అయినా, ఆ కేకలకు వాళ్ళలో కొంతమందికి చురుకు పుట్టిందేమో ఏకాంతంగా మొగుళ్ళతోపాటు నక్కకు జారుకున్నారు.

పి. యు. సి. చదువుకు గోపి, అత్తారింటికి సీత ఒకే రైలులో ప్రయాణం చేశారు. ఒళ్ళంతా కమిలిపోయి భయం భయంగా చూస్తున్న సీత చూపులూ, సీత కళ్ళూ గోపిని చాలాకాలం వెంటాడి నవి. ఊళ్ళో చాలా తెలుగు సినిమాలు చూచాడు గోపి. ప్రతి సినిమాలో మొదటి రాత్రి సీను తప్పకుండా ఉంటుంది. గదిలో పందిరి మంచం, బారులు బారులుగా వేలాడుతున్న మల్లెల దండలు, ఆకాశంలో నిండు చందమామ, పెళ్ళికుమారుడు, పెళ్ళి కుమార్తె కలిసి పాడే యుగళగీతి. చూడడానికి హాయిగా ఉండేది. సినిమాలో పెళ్ళి కుమార్తె ఒళ్ళు ఇలా కమిలిపోయి చూపించినట్టు గుర్తులేదు గోపికి. ఆవిడ కళ్ళు ఇలా భయం భయంగా చూడలేదు. సిగ్గుతో, క్రీగంట చూపులతో హాలులో ఉండే జనాన్ని గిలిగింతలు పెట్టేది. కానీ, సీత కళ్ళు? ఆ కళ్ళు ఏమంటున్నాయి?



కాంతిదూతలు

చిత్రం — పి. సాంబశివరావు (గుంటూరు—2)

సీత కళ్ళు పదే పదే కనుపించి గోపి హృదయం గిజగిజ కొట్టుకుంది.

మళ్ళీ వేసవి సెలవులు వచ్చాయి. పి. యు. సి. పరీక్షలు బాగా వ్రాసి ఘన విజయంతో స్వగ్రామం తిరిగి వచ్చాడు గోపి.

నరసింహం మాస్టార్ గారి ఇంటిలో సీత కనిపించింది — ఎత్తు కడుపుతో! ఒంపులు తిరిగిన శరీరం ఇప్పుడు పీపాలా కనుపించింది గోపి కంటికి. గోపిని చూస్తూనే ముఖమైనా చూపకుండా వెళ్ళిపోయింది సీత. గోపి మనస్సు చివుక్కుమంది. సీతతో మాట్లాడాలని పించింది. కానీ, అవకాశం చిక్కలేదు! సెలవుల్లోనే కాన్పు జరగడం, పురుటిలోనే బిడ్డ పోవడం, కన్న పది రోజులకే మొగుడు వచ్చి సీతను వెంట తీసుకుని వెళ్ళడం జరిగిపోయింది. బండిలో స్టేషనుకు వెళుతున్న సీతను దారిలో చూచాడు గోపి. సీత కళ్ళలోంచి కన్నీరు కారిపోతున్నది. అలా బండిలో వెళ్ళిపోతున్న సీతను చూస్తూ ఉంటే గోపి హృదయంలో ఏదో తెలియని అలజడి బయలు దేరింది. ఇంజనీరింగ్ చదవడానికి పట్నం వెళ్ళాడు గోపి. తనతోటుటు కాలేజీకి ఆడపిల్లలు కూడా వస్తున్నారు. వాళ్ళను చూస్తూ ఉంటే గోపికి సీతే గుర్తుకు వచ్చేది. ఇంజనీరింగ్ చదువు సాగుతున్న ఆ ఐదు సంవత్సరాలకాలంలో సెలవులకు స్వగ్రామం వచ్చినప్పుడు రెండు, మూడు సార్లు సీతను చూచాడు.

చూచినప్పుడంతా సీత కడుపు ఎత్తుగానే కనుపించింది గోపికి. అయినా సీతకు ఒక్క బిడ్డ కూడా దక్కలేదని నరసింహం మాస్టార్ గారు చెప్పారు. ఇంకా పైగా అన్నారు కూడా — "సీత రక్తం చెడిపోయింది" అని! తరవాత తెలిసింది గోపికి. సీత భర్త త్రాగుబోతనీ, సుఖ రోగాలతో బాధపడుతున్నాడనీ!

"ఐతే సీత భవిష్యత్తు గురించి ఆలోచించారా?" అంటూ ధైర్యంగా అడిగాడు గోపి నరసింహం మాస్టార్ గారిని.

"ఇక మన బాధ్యత ఏముందోయ్?" అని నిర్మొహమాటంగా అనేశారు ఆయన.

"ఆడది పెళ్ళి అయ్యేవరకూ తండ్రి చేతిక్రింద, పెళ్ళి అయ్యాక భర్త చేతిక్రింద, వృద్ధాప్యంలో కొడుకు చేతిక్రింద బ్రతకవలసి ఉందని మన శాస్త్రాల్లోనే చెప్పేశారు!" అని అన్నారు. గోపి హృదయంలో ఎటువంటి అనుమానమూ మిగల కుండా ఉండిపోవాలని. అంతటితో సీత భవిష్యత్తు గురించి ప్రస్తావన ఆగిపోయింది.

సీత తమ్ముళ్ళిద్దరూ స్కూలు ఫైనల్ తోనే చదువు చాలించి గుమాస్తా పని చేస్తున్నారు. వాళ్ళతో సుమతి చదువు విషయమై ఒకసారి కదిపి చూచాడు గోపి.

"ఇంట్లో చాకిరీ ఎవరు చేస్తారు? అయినా, ఇంకేం చదువు లేద్దూ? దానికీ సీతలా ఒక సంబంధం దొరికితే మన బాధ్యత తీరిపోతుంది. ఏమంటావు?" అని వాళ్ళు చెప్పిన జవాబు విని నిర్ఘాంతపోయాడు గోపి.

"అక్కయ్యకు పెళ్ళి అయ్యేంత వరకూ ఇంటి చాకిరీ సుమతి చేసుకు పోవలసిందేగా?" అంటూ సీత రెండో తమ్ముడు నవ్వి ఊరుకున్నాడు.

వచ్చే కోడలు మొయ్యవలసిన ఇంటి భారం తలుచుకుంటూ ఉంటే గోపికి పిచ్చెక్కినట్లైంది. మరొక సీత కథ!

అలా అయిదు సంవత్సరాలు దొర్లి పోయినవి. గోపి ఇంజనీరింగ్ పాసై సెలవులకు ఇంటికి వచ్చాడు. చిన్నప్పటి నుండి పెరిగిన ఊళ్ళో పెద్ద మార్పులు ఏమీ లేకపోయినా, అతనిలో వచ్చిన మార్పుకి చిన్నప్పటి స్నేహితులంతా దూరం అయిపోయారు. నరసింహం మాస్టార్ గారి ఇంటికి మాత్రం వెళ్ళి వచ్చాడు. సీత కనుపించింది. చూచి పలకరించింది.

ఈసారి సీత కడుపు ఎత్తుగా కనుపించనందుకు లోలోన సంతోషించాడు గోపి!

"బాగున్నావా, గోపీ?"

"బాగానే ఉన్నాను .. నువ్వు ... సీతా?" ఎంత మాట్లాడదామన్నా మాటలు సగంలోనే ఆగిపోయినాయి.

ఇద్దరూ: ఒకరి నొకరు దీర్ఘంగా చూచుకున్నారు అంతే!

తరవాత నరసింహం మాస్టార్ గారు ఆయన భార్యకు మరీ సుస్తీగా ఉండడం చేతనూ, సుమతి పెద్దమనిషి అయిన దగ్గరినుంచీ రక్తం లేక నీరసించి పోతున్నదనీ, అయిదవ సంతానం సుకన్య చదువు మానిపించినా ఇంటి పనులు చేయకుండా బిగదీసుకుని కూర్చుండి పోతున్నదనీ, సాయంగా ఉంటుందని సీతను కొన్నాళ్ళపాటు ఉంచుకున్నామనీ అన్నారు. మొగుడితో వెళ్ళడం ఇష్టంలేని సీత హాయిగా పుట్టింటి చాకిరీ చేస్తూ ఉండిపోయింది.

గోపి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. హైదరాబాదులో మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నరసింహం మాస్టార్ గారికి చెప్పి 'పోదామని ఆ రోజు వాళ్ళ ఇంటికి వెళ్ళాడు.' ఇంట్లోంచి గోపు కేకలు వినిపిస్తే గుమ్మం వద్దనే నిలబడి పోయాడు.

"నేను వెళ్ళను, నాన్నా!" సీత మొత్తుకుంటూంది.

"మొగుడితో వెళ్ళక ... ఇంకా ఎన్నాళ్ళు ఇక్కడే ఉండిపోతావు? అల్లుడు మంచి వాడు కనక ఏదో దయ తలచి ... మాకోసం ఇన్ని రోజులు నిన్ను ఇక్కడ ఉంచాడు ... వెర్రి ముండలా పిచ్చి అరుపులు ... అరవక ..." అంటూ ఆయాసపడుతూ అరుస్తున్న లక్ష్మి గొంతూ—"లంజముండా! రా!" అంటూ అరుస్తున్న సీత మొగుడి గొంతూ ఒకటి వెనక ఒకటి డబ్బారేకుల మోతల్లా విన వచ్చాయి గోపికి. అక్కడినుండి వెంటనే వెళ్ళిపోదాం అనుకుంటున్న గోపికి దిన పత్రిక పెట్టుకుని తాపీగా బయటకు వచ్చిన నరసింహం మాస్టార్ గారు కనిపించారు. ఇంట్లో గిన్నెలు పడిన చప్పుడూ, తలుపులు టపటప వేసిన చప్పుడూ, వాటి నడుమ "విడవండి ... విడవండి" అంటున్న సీత అరుపుల్లా మళ్ళీ మళ్ళీ వినిపించాయి.

గోపి ముఖంలోకి చూచి, "ఏం చేయమన్నావు? తాళిగట్టిన భర్త ..." అంటూ లోపల జరుగుతున్న తతంగానికి న్యాయం చెప్పబోయారు నరసింహం మాస్టర్ గారు.

సీత అరుపులు భరించలేకపోయాడు గోపి. అతనికి కడుపులో దేవినట్లు అయింది. లోపలకు జొరబడి సీత మొగుణ్ణి చితక బాదా లనిపించింది. ఉబుకుతున్న ఆవేశాన్ని అదిమి పట్టి వడివడిగా అక్కడి నుంచి కదిలిపోయాడు. మళ్ళీ చాలాకాలానికి గానీ నరసింహం

## చరిత్రకందని మృతవీరులు

# వీరనారి ఝల్కారి

1857 లో భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ జ్వాలలు ప్రజ్వరిల్లినప్పుడు ఆంగ్లేయులకు విరుద్ధంగా నిలిచి పోరాడిన వీర నారి ఝాన్సీ రాణి పేరు ప్రపంచ ప్రజానీకానికి బాగా తెలుసు. కాని, తరుణ వయస్సులో తన సంసార సుఖాన్నీ, సర్వస్వాన్నీ వదిలి ఝాన్సీరాణికి అండదండగా నిలిచి పోరాడి తన ప్రాణాన్ని కోల్పోయిన వీర వనిత ఝల్కారి పేరు చాలా తక్కువ మందికి తెలుసు. ఝల్కారీ లక్ష్మీబాయికి ప్రాణ స్నేహితురాలు. మన దేశం నుండి పరాయి పాలనను అంతమొందించడానికి కంకణం కట్టిన వీర వనిత.

చిన్న చిన్న సంస్థానాలను తన అధీనంలో తెచ్చుకోవడానికి బ్రిటిష్ ప్రభుత్వం కుయుక్తి పన్నింది. ఝాన్సీ రాణికి సంతానం లేకపోగా, దామోదర రావును దత్తుకు తీసుకున్నది. దత్తత పనికిరాదనీ, ఝాన్సీని తమకు అప్పగించవలసిందనీ బ్రిటిష్ ప్రభుత్వం ఆదేశించింది. ఝాన్సీరాణి బ్రిటిష్ వాళ్ళ బెదిరింపులకు చలించలేదు. పైగా బ్రిటిష్ వారిని ఎదుర్కోవడానికే సిద్ధపడింది. బ్రిటిష్ సైన్యం ఝాన్సీ కోటను ఘేరావేసింది. లక్ష్మీబాయి వారిని ఎదుర్కొని త్రిప్పికొట్టింది.

ఎదుర్కొ యుద్ధం చెయ్యలేని బ్రిటిష్ ప్రభుత్వం లక్ష్మీబాయిని కుయుక్తితో లొంగదీయ ప్రయత్నించింది. ఝాన్సీ కోట ద్వారాన్ని కాపలా కాస్తున్న కాపలా దారుకు డబ్బు ఆశ చూపి కోట రహస్య ద్వారాన్ని కనుగొన్నది. అకస్మాత్తుగా కోటను ముట్టడించింది. సమరానికి సిద్ధంగా లేని ఝాన్సీరాణి తన రాజనీతిని ప్రదర్శించింది. బ్రిటిష్ వాళ్ళకు లొంగినట్లు నటించి సంధిపత్రాన్ని పంపింది. బ్రిటిష్ వాళ్ళు పొరబడ్డారు.

ఈలోగా సైన్యాన్ని ఇంకా సమీకరించుకోవడానికి లక్ష్మీబాయి-కాశీకి వెళ్ళి నానాసాహెబ్‌తో సంప్రదించడానికి సిద్ధపడింది. తన స్నేహితురాలు ఆపదలో చిక్కుకుందని తెలియగానే ఝల్కారి వెంటనే ఎలాగో లక్ష్మీబాయిని చేరుకొంది. లక్ష్మీబాయి కాశీ చేరుకోవడానికి శత్రుసైన్యం తక్కువగా ఉన్న ఖండేరావ్ దర్వాజా గుండా యుక్తితో లక్ష్మీబాయిని కోట దాటించింది.

కాశీకి వెళ్ళిన ఝాన్సీ తిరిగి రాకముందే సంధి గడువు ముగిసింది. బ్రిటిష్ వారు మళ్ళీ కోట ముట్టడించసాగారు.

ఈ విపత్కర సమయంలో ఝల్కారి లక్ష్మీబాయి దుస్తులను ధరించి తానే ఝాన్సీరాణిననీ, తాను బ్రిటిష్ వారికి లొంగిపోతున్నాననీ తెలిపింది. అప్పటి బ్రిటిష్ సైన్యాధికారి ఝాన్సీరాణిని ఎప్పుడూ చూడలేదు. ఝల్కారీని చూసి లక్ష్మీబాయే అనుకున్నాడు అతడు. ఝల్కారీని జనరల్ వద్దకు తీసుకువెళ్ళి లక్ష్మీబాయి పట్టుబడిందని చెప్పాడు.

లక్ష్మీబాయి తనకు తానుగా పట్టుబడే యువతి కాదని అనుమానం వచ్చింది జనరల్‌కు. అప్పుడు లంచం ఇచ్చి లొంగ దీసుకున్న ఝాన్సీ కోట కాపలాదారుని

ఎ. పండరినాథ్

పిలిపించాడు జనరల్. డబ్బుకే తన ప్రాణాన్ని అమ్ముకున్న కాపలాదారు ఇంకేం చేస్తాడు? ఈ రహస్యాన్ని కూడా బయట పెట్టాడు.

కాపలాదారు ఈ రహస్యాన్ని బయట పెట్టబోతుండగానే ఝల్కారీ కత్తితీసి అతణ్ణి నరకబోయింది. క్షణంలో తప్పి పోయింది. జనరల్ అడ్డుకోకపోతే ఆ దేశ ద్రోహి ఝల్కారీ కరవాలానికి బలియై పోయేవాడు. జనరల్ భారత వీర నారీ మణుల సాహస కృత్యాలను విన్నాడే కాని, కండ్లారా చూడలేదు. ఝల్కారీ తల పెట్టిన సాహసకృత్యాన్ని కళ్ళారా చూసిన జనరల్ భారత వీర నారీమణుల ధైర్యానికి జోహారు లర్పించాడు. అయినా, బ్రిటిష్ వారికి ద్రోహం తలపెట్టిన ఝల్కారీ వారి కసాయి విధానానికి బలి కాక తప్పలేదు.

బ్రిటిష్ వారి నుండి మన దేశాన్ని కైవసం చేసుకోవడానికి పోరాటం సలిపి దేశంకోసం తన ప్రాణాన్ని అర్పించిన వారిలో ఝల్కారి ఒకర్తె.

ఝల్కారి 1830 లో ఝాన్సీలోని ఒక సామాన్య కుటుంబంలో పుట్టింది. ఝల్కారీ పద్మశాలి కులానికి చెందిన యువతి. ఝల్కారీ భర్త పేరు పూరణ్. వీరి వివాహం చిన్ననాడే జరిగింది. ఇద్దరూ ఏదో విధంగా దేశ సేవ చేయ తల పెట్టారు. భారతీయ సైన్యంలో చేరిన పూరణ్ ఆంగ్లేయులు పన్ని కుట్ర లన్నింటినీ చూశాడు. తాను చూసినవన్నీ భార్య ఝల్కారీకి తెలుపుతూ ఉండేవాడు. ఆంగ్లేయుల పట్ల ద్వేషం ఏర్పడిం దామెకు.

ఝల్కారీ దుష్కులైన ఆంగ్లేయుల్ని ఈ దేశం నుండి తరిమివేయడానికి జరిగే పోరాటంలో తాను తప్పకుండా పాల్గొనాలనుకొంది. అదనుకై ఎదురుచూడ సాగింది. ఈలోగా ఝాన్సీరాణి లక్ష్మీబాయికీ, ఝల్కారికీ స్నేహం కుదిరింది. ఝల్కారీలో అంతర్లీనమైన స్వాతంత్ర్య భావాలను, ఆమెలో నిండి ఉన్న సాహసాన్ని ఆమెను చూడగానే తెలుసుకుంది ఝాన్సీ రాణి. ఆంగ్లేయులను ఎదిరించడంలో అండదండగా ఉంటానని ఝల్కారీ ఝాన్సీరాణికి వాగ్దానం చేసింది.

ఝాన్సీరాణి దగ్గరే కత్తి తిప్పడం, గుర్రపు స్వారీ నేర్చుకుంది. త్వరలోనే ఝాన్సీరాణి స్త్రీ సైనిక దళానికి నాయకురాలైంది. తన లక్ష్యాన్ని సాధించడానికి కంకణం కట్టింది. దేశంకోసం ప్రాణాలర్పించి దేశ చరిత్ర పుటలలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డ వీర నారీ మణులలో తానూ ఒకర్తె అయింది.

ఝల్కారీ వంటి ఎందరో వీరవనితలు దేశంకోసం ప్రాణాలర్పించి, దేశ చరిత్ర పుటలలో పేర్కొనబడకుండా అజ్ఞాతంగా ఉన్నారు. వారి చరిత్రలను తెలుసుకొని, వారి త్యాగాన్ని, సాహసాన్ని, కర్తవ్య పరాయణతను మననం చేసుకోవడం మన కనీస కర్తవ్యం. ★

మాస్టార్ గారి ఇంటి గడప తొక్కలేదు గోపి.

గోపి ఉద్యోగంలో చేరి రెండు మూడు సంవత్సరాలు దాటిపోయినవి. తండ్రికి గుండె జబ్బుగా ఉండి, ఇంట్లో పెళ్ళి చేసుకోమని పోరు పెడుతుంటే పిల్లను చూడడానికి అయిష్టంగానే స్వగ్రామం వచ్చాడు గోపి. అప్పుడే తెలిసింది అతనికి. నరసింహం మాస్టార్ గారికి రక్తపుపోటు వచ్చి పక్షవాతం వచ్చిందనీ, లేవలేని పరిస్థితిలో ఉన్నారని అందరూ చెప్పు కుంటూ ఉంటే ఆయన్ని చూడడానికి వెళ్ళకుండా ఉండలేకపోయాడు గోపి.

ఇంట్లో ఆడపిల్లలు, లక్ష్మి తప్పించి ఇంకెవరూ ఎదురు వచ్చి పలకరించలేదు. సెలవు తీసుకునే ముందు వద్దను కుంటూనే అడిగాడు — "సీత బాగుందా?" అని. నరసింహం మాస్టార్ గారి కళ్ళ లోంచి కన్నీరు బొట బొటమని కారింది.

"సీత — సీత చచ్చిపోయిందా?" అని ఒక్కసారిగా అడిగాడు గోపి, సీత జీవి తానికి ఆత్మహత్యే శరణ్యం అని నిశ్చ యించిన గోపి.

"హుఁ! చచ్చిపోయినా బాగుండును! ఎవడితోనో లేచిపోయిందని పుకారు!" ఆయాసపడుతూనే కోపంగా అన్నది లక్ష్మి.

"లేచిపోయిందా? !" నమ్మలేనట్లు అడిగాడు గోపి.

"ఆఁ! ఆఁ! అంత ధైర్యం ఎక్క ణ్ణుంచి వచ్చిందో ఆ భగవంతు డెరుగు! ఉన్నట్లుండి ఒక రాత్రి ఎవరికీ చెప్ప కుండా ఇల్లు విడిచి పోయిందట. దాని మొగుడు ఇక్కడకు వచ్చి చెప్పేదాకా మా కసలు ఏమీ తెలియదు. పోలీసులకు కూడా చెప్పాడట. ఎక్కడా కనిపించలేదు" అంటూ చెప్పుకు పోయింది లక్ష్మి.

నరసింహం మాస్టారుగారు గోపికి ఏదో చెప్పాలని దగ్గరకు పిలిచారు.

"గోపి ... ఈ తప్పంతా నాదేరా! సీతకు చదువు చెప్పించకుండా చేశాను. త్రాగుబోతు చేతిలో పెట్టి దాని జీవితం నరకం చేశాను. పిచ్చితల్లి! పుట్టింటికి తిరిగి రాలేక, ఆత్మహత్య చేసుకోలేక ఎవడితోనో లేచిపోయింది. దాన్ని వాడైనా సరిగా చూస్తేనా కదే చాలు" అంటూ క్షీణ స్వరంతో వినిపించీ వినిపించకుండా అన్నారు నరసింహం మాస్టార్ గారు.

"ఇదీ వరస! మతిపోయి ఇష్టం వచ్చి నట్లు వాగుతారు. మొన్న సుకన్యతో అంటున్నారు. అది చదువుకోవాలిట. ఉద్యోగం చేయాలిట! దానికి ఇష్టం వచ్చిన వాణ్ణి పెళ్ళి చేసుకోవాలట! బాగుందా ఆయన ఇచ్చే సలహాలు? లోకం మా మీద రాళ్ళు రువ్వాలని ఈయన


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# రాక్షస సం॥ దీపావళి కథల పోటీ

ప్రతి సంవత్సరంవలెనే ఈ రాక్షస సం॥ దీపావళి సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తూంది.

**ఆనంద దీపావళి కథల పోటీలో 5,000 రూపాయల బహుమతులు అందజేశాము. రచయితలకు, రచయిత్రులకు ప్రోత్సాహం కలిగించాలనే సంకల్పంతో ఈ సంవత్సరం కూడా దీపావళి కథల పోటీలో మొత్తం 5,000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.**

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకోవలెననీ, పాఠకులకు ఉత్తమమైన కథలు అందజేయాలనీ, మా కృషి విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలనీ కోరుతున్నాము.

## మొదటి బహుమతి రు. 2,500
## రెండవ బహుమతి రు. 1,800
## మూడవ బహుమతి రు. 700

### దీపావళి కథల పోటీ నిబంధనలు:

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయ రచనలేకాని, అనువాదాలు పంపరాదు.
3. రచన అరఠావు 12×8 అంగుళాలు సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవానిని ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. పోటీకి పంపిన కథలను ఏ సందర్భంలోను తిప్పి పంపించడం జరగదు.
8. ప్రచురణకు ఏ కలం పేరు ఉపయోగించినా తమ అసలు పేరును విధిగా వ్రాయాలి.
9. రచనలను "ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2"కు పంపాలి.

**బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము**

**రాక్షస సం॥ దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ** — **ఆగస్టు 18, 1975**



వికాసం

ఫోటో — ఎస్. శారద (నెల్లూరు)

గారి కోరికైనా ఉండాలి ...'' అంటూ కళ్ళు తుడుచుకుంది లక్ష్మి.

'కాలూ చేయీ పడిపోయేంతవరకూ మనిషికి జ్ఞానం రాదు కాబోలు! చేసిన తప్పులు ఒప్పుకోవడానికి పశ్చాత్తా పపడడానికి అనారోగ్యం కావలసిందేనా? భవిష్యత్తు గురించి యువకుడు ముందుగా ఎందుకు ఆలోచించుకోడు? నే నెవరిని? ఈ ప్రపంచంలో నే నెందుకు పుట్టాను? పుట్టినందుకు నా కర్తవ్యం ఏమిటి? నేను ఎంతవరకు చదువుకోగలను? ఈ చదువు చదివి ఏం ఉద్యోగం చేయాలి? నే నెప్పుడు, ఎవరిని పెళ్ళి చేసుకోవాలి? నా భార్యను ఎలా సుఖపెట్టాలి? ఎంత మంది బిడ్డల్ని పోషించగలను? నా బిడ్డల్ని పెంచి పెద్దచేసి నేను వాళ్ళకు చూపే మార్గం ఎలా ఉండాలి?' అంటూ తనను తాను ఎప్పుడన్నా ప్రశ్నించుకోవడం జరుగుతున్నదా?

మనం జంతువులం కాముకదా? మనిషికి ఆలోచనా శక్తి భగవంతుడు ఇచ్చాడు. ఈ ఆలోచనా శక్తి ప్రతి మానవుడు ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటున్నాడు? మనిషి నిజంగా ఎప్పుడో కాని ఆలోచించడు. వయస్సులో ఉన్నప్పుడు— అందులో విద్యార్థి దశలో ఉన్నప్పుడు అసలు ఆలోచించడు. అప్పుడు ఆలోచించడానికి వ్యవధి ఎక్కడిది! ఊళ్ళో సినిమాలు చూడడంతోనూ, ఆటలు ఆడుకోవడంతోనూ, పక్కింటి అమ్మాయిలనో, కాలేజీకి వచ్చె అమ్మాయిలనో గోపెడ్తు ప్రేమించడం, వాళ్ళతో ప్రేమ కలాపాలు జరపడంతోనూ మనస్సు ఉక్కిరిబిక్కిరి అయిపోతుంది. నిర్ణయాలు, పెద్ద పెద్ద ఆలోచనలు తలిదండ్రులుంటే వదిలేసి హాయిగా కాలం గడిపేస్తున్నారు యువకులు. హాఁ! వయస్సు మళ్ళినాక, కాలూ చేయీ పడిపోయినాక ఆలోచించి ప్రయోజనం ఏమిటి? ఇదంతా మన ఖర్మ అంటూ వేదాంతం చెప్పినా ప్రయోజనం లేదు!' గోపి మనస్సులో ఎన్నడూ లేని సంఘర్షణ! తిరుగుబాటు!! ఎదురుగా పారిపోయి సన్నగా, నెదురుబద్దలా కనుపించింది సుమతి. సుమతి నెనక నుకన్య మరి కొన్ని సీత కథలకు పునాది వేస్తున్నట్లు కనిపించారు. వీటికి అంతం ఎవరి చేతుల్లో ఉంది? ఆలోచనలతో వెలరేగిపోయింది అతని మనస్సు. పెళ్ళి చూపులకు వెళ్ళకుండానే వెంటనే హైదరాబాదు తిరిగి వెళ్ళిపోయాడు గోపి.

* * *

ఆ రోజు మానేజర్‌గారింట్లో పెద్ద విందు జరిగింది. అందరూ ఇష్టం వచ్చినట్లు తాగారు. ఎప్పుడూ మద్యం సేవించని గోపి కూడా ఒళ్ళు తెలియకుండా తాగాడు. మైకంలో తల తిరిగింది. ప్రపంచమంతా మసక మసకగా కనుపించి తూలిపోయాడు. స్నేహితుడు చలం కారులో వెళ్ళడం మాత్రం గుర్తుంది గోపికి.

కలలో సీత కనుపించిం దనుకున్నాడు. సీత ఒడిలో తల ఆనించి నిద్రపోయిన ట్లనిపించింది.

తెల్లవారతున్న దనగా మైకం వదిలింది. కళ్ళు నులుముకుని చూచాడు. సీత ఒడిలో గోపి! అది కల కాదు!! గుండెలు అదిరిపోయాయి.

''సీతా!!'' షాక్ తిన్న వాడిలా పక్క మీద నుండి లేచి కూర్చున్నాడు. తల నొప్పికి తట్టుకోలేనట్లు తల గట్టిగా పట్టుకున్నాడు.

సీత నవ్వింది.

''నువ్వూచెడిపోయావా,గోపీ! తాగడం నేర్చుకున్నా వన్న మాట! మాలాంటి వాళ్ళ వద్దకు రావడం అలవాటు చేసుకున్నావా! అంతేలే! ఇది మగవాళ్ళ రాజ్యం!'' అన్నది సీత.

''నువ్వు — నువ్వు వ్యభిచారం చేస్తున్నావా?'' వణికిపోతూ అడిగాడు గోపి.

''ఏం, తట్టుకోలేకుండా ఉన్నావా? హాఁ! నా జీవితం ఇలా తయారు అవుతుందని నువ్వు ఎప్పుడూ అనుకోలేదా? కూతురు మెడలో పసుపుతాడు పడగానే బాధ్యత తీరిందనుకునే తల్లిదండ్రులూ, ఆడదాని మెడలో మంగళసూత్రం కట్టగానే పెళ్ళాం అని బలవంతంగా నైనా ప్రతి రోజూ వాళ్ళ దాహం తీర్చుకునే భర్తలూ ఉన్నంతకాలం ఈ చదువురాని సీతలకు వ్యభిచారం తప్ప వేరే దారి లేదని చదువుకున్న మీబోటి పురుష పుంగవులకు తెలియలేదంటే నాకు ఆశ్చర్యంగా ఉంది! ఆత్మహత్య చేసుకొని ఈ జీవితం చాలించుకొని ఉంటే మీ కందరికీ తృప్తిగా ఉండేది కదూ? అయినా, గోపీ, ఈ జీవితం చాలించుకోవడానికి నేను బతికిందంటూ ఎప్పుడు? ఇప్పుడే కదా స్వేచ్ఛ అంటే ఏమిటో, బ్రతకడం అంటే ఏమిటో తెలుసుకుంటున్నాను.''

''సీతా!'' గట్టిగా అరిచాడు గోపి.

''అవును, గోపీ! గడిచిన జీవితం కంటే నాకు ఈ జీవితంలో సుఖం ఉందనిపిస్తుంది! నాకు ఇదే బాగుంది.'' సీత చెంప చెళ్ళుమంది. గోపి కోపంగా బుసబుసలాడాడు.

సీత నవ్వింది—ఈ సారి గట్టిగా.

''ఈ పని చేసినందుకు ఇప్పుడు బాగా డబ్బులన్నా దొరుకుతున్నాయి! అందంగా ఉన్నావని చెప్పేవాళ్ళు ఉన్నారు. నా ఒళ్ళు ఇదివరకులా రోజూ కమిలిపోవడంలేదు. ఇంటి చాకిరీ అసలే చేయ నక్కరలేదు. ఏటా ఏటా బిడ్డల్ని కనడం లేదు. నాతో ఒక్కొక్కప్పుడు మృదువుగా మాట్లాడేవారు ఉన్నారు. ఎప్పుడో కాని మృగంలా బలవంతంగా నా మీదకు ఉరకడంలేదు ఎవరూ.''

''ఆపు, సీతా, ఆపు!'' గట్టిగా అరిచాడు గోపి.

''ఎందు కలా బాధపడతావు? నిజం ఎంతో చేదుగా ఉంది కదూ? అయినా, ఇన్ని సంవత్సరాలూ నా గురించి లేని బాధ ఇప్పు డెందుకు? నువ్వూ అందరిలా వచ్చావు. నే చిన్ననాటి స్నేహితుడివికదా అని, చిన్నప్పుడు నా గుప్పిట్లో వేరుసెనగ కాయలు కొనిపెట్టే వాడవని ఆదరించి రాత్రంతా నీకు సేవ చేశాను. నాలో ఎన్నడూ లేని ఆనందం కలిగింది. నాకు లేని బాధ నీ కెందుకు, గోపీ?'' అని అడిగింది సీత.

''నీకేం తెలుసు? నా బాధ నీకేం తెలుసు?'' అని బాధగా అన్నాడు గోపి.

''నిన్ను చూస్తూ ఉంటే నాకు కష్టంగా ఉంది, గోపీ! ఒక్క మాట అడగనా? నా తాగుబోతు భర్త నన్ను ప్రతిరోజూ బలాత్కరిస్తూ ఉంటే మీ కెవ్వరికీ తప్పుగా అనిపించలేదే! కానీ ... ఈ రాత్రి ... నా జన్మలో ఒక దివ్యమైన రాత్రి ... నీ కింత తప్పుగా ఉందా? నరసింహం మాస్టార్ గారి కూతురు సీత వ్యభిచారం చేస్తున్నదని బాధా? ఎందుకు, గోపీ? ఎందుకు. నాకా చదువు రాదు ఉద్యోగం చేసుకొని స్వతంత్రంగా బ్రతకడానికి. నా బ్రతుక్కి ఆత్మహత్యే శరణ్యం అనుకుని పక్కింటి బావిలోనో, ఊరి చెరువులోనో దూకేయా లనుకొన్నాను. అటువంటి నాకు ఎదురింటి విశాలాక్షితో పరిచయం ఏర్పడింది. 'సీతా! సుఖపడు' అంటూ ఆవిడ నాకు ఉపదేశం చేసింది!

'సుఖమా? నా జన్మకి సుఖమా?' అని అడిగాను.

'నీకేం? నువ్వు చూడడానికి బాగుంటావు' అని చెప్పింది. అంతవరకూ నేను బాగుంటానని నాతో ఎవరూ అనలేదు. 'అయితే?' అని వెర్రిగా అడిగాను ఆవిణ్ణి!

పిచ్చిదానా, నన్ను నమ్మి నా వెంట రా! నీ కొక పూల బాట చూపిస్తాను' అంటూ నన్ను ఇంత దూరం తీసుకు వచ్చింది. చిన్నప్పుడే మొగుడు చచ్చి పోయిన విశాలాక్షి అప్పట్లో వంటలక్ష్మి మాత్రమే. ఇప్పుడు దర్జాగా బతుకు తున్నది. ఈ ఇంటి పెత్తనం అంతా ఆవిడదే. ఈ ఇంట్లో నా లాంటి వాళ్ళు మరికొందరు ఉన్నారు. నీ ఫ్రెండు 'చలం' పక్క గదిలోనే ఉన్నాడు. ఆయన మా కందరికీ చాలాకాలంగా పరిచితుడు. మా ఆరోగ్యం బాగుండాలని నెలనెలా

## వ్యక్తిత్వం

**నిజమైన విద్య జీవితంతో ప్రారంభమవుతుంది. మనకు తెలియని వయసులోనే మన వ్యక్తిత్వానికి పునాదులు ఏర్పడ తాయి. ఆ తరవాత ఎంత చదివినా, ఆ పునాదుల్ని మార్చడం దుస్తరం.**


—ఫ్రాంక్లిన్

డాక్టర్ని కూడా తీసుకు వస్తాడు. ఇప్పుడు నా రక్తం పరిశుద్ధంగా ఉందని డాక్టర్ సర్టిఫికేటు కూడా ఇచ్చాడు."

"ఆపు సీతా! ఆపు!" అంటూ చెవులు మూసుకున్నాడు గోపి.

"నిన్ను చూస్తూ ఉంటే మా ఇంట్లో బల్లమీది ఉండే మూడు కోతుల బొమ్మ గుర్తుకు వస్తున్నది, గోపీ! మీలాంటి వాళ్ళంతా ఇంతే !! ఆ మూడు కోతుల్లా 'చూడకు, వినకు, మాట్లాడకు' అన్నట్లు కళ్ళు మూసు కొని, చెవులు మూసుకొని, నోటికి తాళం వేసుకొని సంఘంలో స్త్రీలకు జరుగు తున్న అక్రమాలకు దూరంగా జరిగిపోయి దర్జాగా బతుకుతున్నారు" అన్నది సీత కటువుగా!

"సీతా! నిన్ను ఈ క్షణమే ఇక్కడి నుండి తీసుకువెళతాను!" అన్నాడు గోపి ఆవేశంగా.



విశ్రామం    చిత్రం — బి. బాబురావు

"హుఁ! తీసుకువెళ్ళి మళ్ళీ నరకంలోకి తోస్తావా? నా కోసం పులిలా గాలిస్తున్న నా త్రాగుబోతు భర్త వచ్చి నన్ను బలాత్కరిస్తే కళ్ళు మూసుకుని, చెవులు మూసుకొని, నోటికి తాళం వేసుకొని నీ దారి నువ్వు వెళ్ళిపోతావా?" అని కోపంగా అడిగింది సీత.

"నిన్ను పెళ్ళిచేసుకుంటాను" అని అనాలనిపించినా అనలేకపోయాడు. ఎలా అంటాడు? సీత మొగుడు బతికే ఉన్నాడు. ఇది చట్ట విరుద్ధం! నిస్సహా యంగా సీత కళ్ళలోకి చూశాడు గోపి.

"గోపీ! ఎందు కిలా నీలో నువ్వు బాధ పడతావు? ఎప్పటిలా నీ దారి నువ్వు వెళ్ళు! ఈ చదువురాని సీతను మరిచిపో! గడిచిన రాత్రి ... నీకూ, నాకూ కలగా మిగిలిపోనీ. నిన్ను మాటలతో కష్టపెట్టి ఉంటే క్షమించు" అన్నది సీత మనః స్ఫూర్తిగా.

"సీతా! ఎప్పుడో చేయవలసిన పని ఈ రోజు చేయగలుగుతున్నాను. నిన్ను నాతో తీసుకు వెళతాను. నిన్ను — నిన్ను పెళ్ళి చేసుకునే అధికారం నాకు లేదు. నీ భర్త నీకు విడాకులు ఇవ్వందే నువ్వు నాకు ఏమీ కాలేవు. మనిద్దరి మధ్యా రక్త సంబంధం లేదు. చట్టబద్ధమైన సంబంధం అంతకన్నా ఉండడానికి వీలు లేదు. అయినా, నన్ను నమ్మి నా వెంట వస్తావా?" అని అడిగాడు గోపి.

అతని మాటలకు నిర్ఘాంతపోయింది సీత.

"నా తండ్రి గుండె జబ్బుతో బాధ పడుతున్నాడు. ఈ వార్త ఆయన దాకా వెళితే ఆయనకు ఏం కానున్నదో నాకు తెలుసు. మన కులాలు వేరు — అందులో నువ్వు వివాహితవు! నీ భర్త నన్ను జైలులో పెట్టించవచ్చు. అంతటి అధి కారం భర్తగా ఈ సంఘంలో అతనికి ఉంది. అయినా, అన్నింటికీ తెగించే ఈ నిర్ణయానికి వచ్చాను. మన దోవ ముళ్ళతో నిండి ఉంది. అనుక్షణం మనకు బాధను కలిగించవచ్చు. అయినా, ఆ దోవలో నాతోబాటు నడవమని అడుగుతున్నాను... వస్తావా, సీతా?" అంటూ చేయి చాపాడు గోపి.

"గోపీ!" సీత కండ్లలో నీళ్ళు తిరి గింది. నోట మాట రాక ఏడుస్తూ ఉండి పోయింది.

"నిన్ను చదివిస్తాను, సీతా! నిన్ను ప్రయోజకురాలిని చేస్తాను! ఈ సంఘంలో నీకు గౌరవం దక్కిస్తాను!" అన్నాడు గోపి మెరుస్తున్న కళ్ళతో.

"గోపీ! గోపీ! నువ్వు దేవుడివి ... దేవుడివి ..." అంటూ అతని కాళ్ళమీద వాలిపోయింది సీత! ★